

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :184 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | గురువారం 12-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

దుబ్బాకను కరువు ప్రాంతంగా ప్రకటించాలి : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



దుబ్బాక:నవంబర్ 11 : రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దుబ్బాక నియోజకవర్గాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని, నిధుల కొరతతో ఆగిపోయిన అభివృద్ధి పనులు పున ప్రారంభించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నందుకే నిధులు ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారంటే, రైతుల కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ అనాజీపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రారంభంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాల్వల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి, అవసరమైన నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. సాగునీటి వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం వల్ల నష్టపోయేది రైతులేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న రాజకీయ కోపాన్ని రైతులపై చూపించడం సరికాదని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. రైతులకు సాగునీరు అందించడం, పంటలను కాపాడటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. అలాగే సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిర్మల, మండల సర్పంచుల పోరం అధ్యక్షులు రేకుల నర్సింహారెడ్డి,మాజీ జెడ్పిటిసి యాదగిరి, మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్, మాసంపల్లి రాజు, ఉప సర్పంచ్ లు సంతోష్ కుమార్, హనుమంతు రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యం, వెంకట్ గౌడ్, బాగిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, గల్వ దయాకర్ రెడ్డి, మండల నాయకులు మల్లారెడ్డి, శ్రీధర్, భార్గవ్, బుజ్జి, రాజారాం మధు, తదితరులు పాల్గొన్నారు.

వాటికి ఆశపడకుండా ఓటేయండి'.. గ్రాడ్యుయేట్లకు కవిత పిలుపు



హైదరాబాద్, నవంబర్ 11: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా మార్పు రావడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శలు గుప్పించారు.బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే మార్పు సాధ్యమన్నారు. త్వరలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. 4 కోట్ల మందిలో 80 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని చెప్పారు. అయితే 80 లక్షల్లో 10 లక్షల మంది కూడా నమోదు చేసుకోలేదన్నారు.ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కవిత కోరారు. వారి ఓటుతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 8 మంది యువ ఎంపీలు ఉంటే ఒక్కరే పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేనివారు ఉన్నారని చెప్పారు. తెలంగాణ ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ రూ. 200 కోట్లు ఖర్చు చేసి ఈ ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని ఆరోపించారు. యువత డబ్బులకు అమ్ముడు పోకుండా ఓట్లు వేయాలని సూచించారు. 77 నియోజకవర్గాల్లో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని.. నేటి నుంచి అధికారికంగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు కవిత వెల్లడించారు. టీఆర్ఎస్ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది యుద్ధరంగంలో దింపుతున్నామని చెప్పారు. కలిసి వచ్చే పార్టీలతో ఎన్నికల్లో ముందుకు వెళ్తామని వెల్లడించారు. టీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం అధికారిక గుర్తింపు ఉందన్నారు. కొన్ని అభ్యంతరాలు వచ్చాయని.. వాటికి సంబంధించిన సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని కవిత పేర్కొన్నారు.

తెలంగాణలో రెండోసారి 'భారత్ సమ్మిట్'.. ప్రపంచ పరిస్థితులపై చర్చలు

హైదరాబాద్, నవంబర్ 11: తెలంగాణలో రెండోసారి 'భారత్ సమ్మిట్' జరుగుతోందని కేంద్రమాజీ మంత్రి, కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ తెలిపారు. ఈరోజు(బుధవారం) హెచ్ఐసీసీలో మీడియాతో మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రపంచంలో ఉన్న పరిస్థితులపై సమ్మిట్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. దేశాల మధ్య కోఆర్డినేషన్ కోసం సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. గాంధీ సిద్ధాంతాలు ఈ దేశానికి అవసరమన్నా రు. ప్రపంచ వ్యాప్తంగా మానవత్వం పెంపొందేలా భారత్ సమ్మిట్ కొనసాగుతుం దని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రోగ్రెసివ్ భావాలున్న వారిని సదస్సుకు ఆహ్వానించామని సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఐడియాలజీ ప్రపంచానికి దిక్సూచి: భట్టి

'భారత్ సమ్మిట్'కు 70 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు వస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమ్మిట్‌కు వస్తున్న ప్రతినిధులకు స్వాగతం తెలిపారు. భారత్ సమ్మిట్‌ను తెలంగాణలో జరపడం గౌరవంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విభజన రాజకీయాలు, విద్వేష రాజకీయాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తాము గాంధీ పాటించిన అహింస సిద్ధాంతాన్ని పాటిస్తున్నామని చెప్పారు. నెహ్రూ ప్రతిపాదించిన అలీన విధానం ఎంతగానో ఉపయోగపడిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఐడియాలజీ ప్రపంచానికి దిక్సూచిగా పనిచేస్తుందని వెల్లడించారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల చర్చకు భారత్ సమ్మిట్ ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.



అదే కాంగ్రెస్ తపన: మంత్రి శ్రీధర్ బాబు

బీజేపీ ఆలోచన వేరని.. ప్రగతిశీల ఆలోచనలు ఉన్న కాంగ్రెస్ ఆలోచన వేరని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేద్దామని బీజేపీ ఆలోచిస్తోందన్నారు. ప్రపంచంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడమే కాంగ్రెస్ తపనగా చెప్పుకొచ్చారు.భారత్ సమ్మిట్ ఒక ఎకనామిక్ సమ్మిట్‌లాగా ఉపయోగపడుతుందన్నారు.ఈ సమ్మిట్ రాజకీయాల కోసం కాదని అన్నారు. బీజేపీ అనవసర విమర్శలు మానుకోవాలని హితవుపలికారు.భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తే తప్పేంటని నిలదీశారు.టెక్నాలజీ, ప్రస్తుత సవాళ్లపై ఎవరైనా మాట్లాడొచ్చన్నారు.ప్రగతిశీల భావాలున్న ప్రతిపార్టీని సమ్మిట్‌కు ఆహ్వానించామని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులపై చర్చిస్తామన్నారు.

దీపావళి టపాసుల కాలుష్యంపై యోగి సంచలన వ్యాఖ్యలు!

లక్నో:దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంతో దేశంలోని పలు నగరాల్లో వాయు కాలుష్యం పెరిగిందన్న ఆందోళనలపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. పండుగ సమయంలో ప్రజలు టపాసులు కాల్చినప్పుడే కొందరికి కాలుష్యం గుర్తుకొస్తోందని వ్యాఖ్యానించారు.ఒక్కరోజు బాణసంచా కాల్చడం వల్ల ఏర్పడే కాలుష్యం త్వరగానే తగ్గిపోతుందని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. దీపావళి వేడుకలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి నిషేధాలు విధించలేదని స్పష్టం చేశారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజలు దీపావళిని ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారని, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారని తెలిపారు. దీనిపై కొందరు కాలుష్యం పెరిగిందంటూ విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఒక్కరోజు టపాసులు కాల్చితేనే కాలుష్యం గురించి మాట్లాడుతున్నారని, అవినీతి కార్యకలాపాలతో వ్యవస్థను కలుషితం చేస్తున్న వారిని మాత్రం ఎవరూ ప్రశ్నించడం లేదని విమర్శించారు. దీపావళి సందర్భంగా అయోధ్యలో తాను కూడా బాణసంచా కాల్చే కార్యక్రమంలో పాల్గొన్నట్లు వెల్లడించారు. 2017కు ముందు ఉత్తరప్రదేశ్‌లో హోలీ, దీపావళి, విజయదశమి, జన్మాష్టమి, శివరాత్రి, క్రిస్మస్, ఈద్ వంటి పండుగల సమయంలో అల్లర్లు జరిగేవని యోగి ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు సంతోషంగా పండుగలు చేసుకుంటున్న సమయంలోనే కాలుష్యంపై విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.



చామలతో విభేదాలపై స్పందించిన పీసీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, ఎంపీ, టీపీసీసీ మీడియా విభాగం చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డితో తనకు విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మీడియా కమిటీ చైర్మన్ చామలతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. టెక్నికల్ ఇష్యూ వల్లనే కమిటీ జాబితా ఆగిపోయిందని చెప్పారు. కిరణ్ కుమార్ రెడ్డి మీడియా డిపార్ట్‌మెంట్‌ను సమర్థవంతంగా నడుపుతారనే తాను ఏరికోరి అతడిని తెచ్చుకున్నానని చెప్పారు. తామంతా కలిసే మీడియా కమిటీ లిస్టును సిద్ధం చేశామని అన్నారు. టాలెంట్ హంట్ చేసే కిరణ్ కుమార్ రెడ్డి లిస్టు సిద్ధం చేశారని, టెక్నికల్ ఇష్యూ వల్లనే కమిటీ జాబితా ఆగిపోయిందని చెప్పారు. అంతేకాకుండా రాహుల్ గాంధీ హైదరాబాద్ రాకుండా అడ్డుకుంటామని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.అలా అయితే ప్రధాని మోడీతో ప్రతిరోజు క్షమాపణ చెప్పించాలన్నారు. దేశం కోసమే రాహుల్ గాంధీ ఆలోచిస్తున్నారని, భారత్ సమ్మిట్ లో ఆయన పాల్గొని తీరతారని వ్యాఖ్యానించారు. గిగ్ వర్కర్లతో రాహుల్ గాంధీ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ ఆరోపణలు చేస్తోందని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవి వచ్చినా త్యాగం చేసిన మహానాయకుడు అని అన్నారు. సోనియా గాంధీ 2009లో, రాహుల్ గాంధీ 2014 ప్రధానమంత్రి పదవి అవకాశం ఉన్నా తీసుకోలేదన్నారు. వాళ్లు దేశానికి భవిష్యత్ అని చెప్పారు. వాళ్ల కుటుంబంలో ఎంతోమంది దేశంకోసం ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. బీజేపీ నేతలు చరిత్ర తెలుసుకోకుండా మాట్లాడుతురని మండిపడ్డారు.

ఎఐ ప్రభావంపై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు!

హైదరాబాద్,నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు పలు విభాగాల్లో AI తో ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ బ్లూ కాలర్ జాబ్స్ నూ× తో భర్తీ చేయలేమన్నారు. నైపుణ్యం పెంచుకుంటే భవిష్యత్‌లో బ్లూ కాలర్ ఉద్యోగ అవకాశాలకు కొదవ ఉండదని తేల్చేశారు.

జాతీయ విద్యా దినోత్సవం– మైనారిటీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమం బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారాభవన్‌లో జాతీయ విద్యా దినోత్సవం– మైనారిటీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, గులాంనబీ ఆజాద్ నుంచి షబ్బీర్ అలీ వరకు కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు ఎన్నో అవకాశాలను ఇచ్చిందన్నారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.మైనారిటీ రిజర్వేషన్‌ను తొలగిస్తామని బీజేపీ చేవెళ్ల సభలో ప్రకటించిందని, ముందు గుజరాత్‌లో తొలగించి చూపించాలని మేం సవాల్ విసిరామని అన్నారు. మైనారిటీల సంక్షేమం మా బాధ్యత అని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర లేదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ సొంతమన్నారు. పేదలకు, మైనారిటీలకు కాంగ్రెస్ ఓటు హక్కు కల్పిస్తే వాటిని తొలగించాలని బీజేపీ చూస్తోందన్నారు.

మేం చేసి చూపించాం, ఆ చరిత్ర మాకుందన్న సీఎం రేవంత్

12 ఏళ్ల గడిచినా బీజేపీ.. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ హామీ నిలబెట్టుకోలేదన్నారు. బీజేపీతో పోరాడే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని కుండబద్దలు కొట్టేశారు. తెలంగాణ గల్లీ నుంచి వెళ్లిన కారు, ఢిల్లీకి చేరగానే మోదీ కమలంగా మారిపోతోందని చురకలు అంటించారు. మైనారిటీ స్కాలర్‌షిప్ లను తొలగించాలని బీజేపీకి ఏ దేవుడు చెప్పాడని ప్రశ్నించారు. క్రీడల్లో దేశ ప్రతిష్టను పెంచిన మైనారిటీ క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతితోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి గౌరవించిందన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి గౌరవించామని, షబ్బీర్ అలీని సలహాదారులుగా నియమించామన్నారు. ప్రజా ప్రభుత్వంలో మైనారిటీలకు ఎన్నో అవకాశాలు కల్పించామన్నారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని, దాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఓల్డ్ సిటీలో మెట్రో పనులను వేగవంతం చేశామని, మూసీ పునరుజ్జీవంతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.మూసీ నదీ పరీవాహకంలో నైట్ ఏకానమీ గా మారుతుందన్నారు. ఈ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. చదువు ఒక్కటే మీ జీవితాలను మారుస్తుందని, పిల్లలను చదివించండి, నైపుణ్యాన్ని అందించాలన్నారు. నిఖత్ జరీన్, సిరాజుద్దీన్ తరహాలో పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని, నైపుణ్యం, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, పిల్లలను చదివించాలన్నారు. మీ సోదరుడిగా మీకు అండగా నేను ఉంటానన్నారు. మీ సమస్యలను అర్థంచేసుకుని పరిష్కరించే బాధ్యత నాదన్నారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ కు మొదటి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు బాధ్యతలు అప్పగించారని గుర్తు చేశారు. దేశంలో ఐఐటీలను ఏర్పాటు చేసి ఎంతో మంది ఇంజనీర్లుగా తయారయ్యేందుకు అబుల్ కలాం ఆజాద్ పునాది వేశారని వివరించారు. విద్యాభివృద్ధికి ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించిన ఘనత కలాం, ఆజాద్ సొంతమన్నారు. అబ్దుల్ కలాం హయాంలో ఐటీఐలకు పునాది పడిందని, ఇప్పుడు వాటిని మనం ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసుకున్నామన్నారు.



రాహుల్‌ను పీఎం మెటీరియల్ చేసేందుకే ఇదంతా..

హైదరాబాద్, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్' తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. సుభాష్ రామచందర్ రావు కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది దేశ ప్రయోజనాల కోసం జరుగుతున్న సమ్మిట్ కాదని, కేవలం దేశ వ్యతిరేక శక్తుల సమాహారమని ఆయన ఆరోపించారు.

భారత్ సమ్మిట్ కాదు.. యాంటీ భారత్ సమ్మిట్

కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని 'యాంటీ భారత్ సమ్మిట్' గా రామచందర్ రావు అభివర్ణించారు. అంతర్జాతీయంగా భారత వ్యతిరేక కుట్రలు పన్నుతున్న వ్యక్తులు, సంస్థలు కలసి ప్రోగ్రెసివ్ అలయెన్స్ రూపంలో ఏర్పడ్డాయని ఆయన పేర్కొన్నారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ ఈ అలయెన్స్ నాయకులతో దిగిన ఫొటోలే వీరి మధ్య ఉన్న సంబంధాలకు ప్రత్యక్ష నిదర్శనమని స్పష్టం చేశారు. ఢిల్లీలోని 10 జనపథ్‌లో సోనియా గాంధీ, ఖర్గేలు 'ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్' ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ కావడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

జార్జ్ సోరోస్ హస్తం, రెజీమ్ చేంజ్ కుట్రలు

ఈ అంతర్జాతీయ సంస్థల వెనుక జార్జ్ సోరోస్ వంటి భారత వ్యతిరేక శక్తులు ఉన్నాయని రామచందర్ రావు ఆరోపించారు.



సంపాదకీయం

గురువారం 12-11-2026

ఎల్ నినో కేంద్రసాయం ఎక్కడ

ప్రకృతి ప్రకోపిస్తే పంటలు ఎండిపోతాయి. వర్షాలు ముఖం చాటేస్తే పొలాలు బీళ్లుగా మారతాయి. కానీ ప్రకృతి వైపరీత్యాల కంటే ప్రభుత్వాల నిర్లక్ష్యం రైతులను ఎక్కువగా కుంగదీస్తుంది. ఎల్ నినో పరిస్థితులు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. పంటలు చేతికందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, పాలకుల ప్రకటనలు మాత్రం కాగితాలకే పరి మితమవుతున్నాయనే విమర్శలున్నాయి.రైతు నష్టపోతున్నాడు. వ్యవసాయం సంక్షోభంలో పడుతోంది. పేద కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది. అయి నా కేంద్రం నుంచి స్పష్టమైన కార్యాచరణ ఎక్కడ? రైతు కన్నీటికి విలువ లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తెలంగాణలో 365 మండలాలను కరు వు ప్రాంతాలుగా ప్రకటించి రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కేంద్రాన్ని కోరినట్లు నివేదికలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 388 మండలాలు కరువు ఎదుర్కొంటున్నాయి. కర్ణాటకలో 57.93 లక్షల హెక్టా ర్లలో పంట నష్టం జరిగినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంచనా. నష్టం విలువ రూ.62 వేల కోట్లకు పైగా ఉంటుందని పేర్కొంది. ఇవి ఆయా రాష్ట్రాలు వెల్లడించిన గణాంకాలు మాత్రమే. దేశంలోని అన్ని రాష్ట్రాల కు సంబంధించిన నష్టాలపై ఒకే విధమైన తుది కేంద్ర నివేదిక ప్రజల ముందుకు రావాల్సి ఉంది. రాష్ట్రాలు నిధులు కోరడం, కేంద్రం పరిశీలిస్తామని చెప్పడం, అధికారులు నివేదికలు తయారు చేయడం.. ఈ తంతు పూర్తయ్యేసరికి రైతు చేతిలో మిగిలేది అప్పులేనా? నష్టాన్ని అంచనా వేయ డానికే నెలలు పడితే రైతు కుటుంబాలు ఎలా జీవించాలి?రైతు ఎకరాకు పెట్టే పెట్టుబడి రోజురోజుకూ పెరుగుతోంది. విత్తనాలు, ఎరువు లు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట పూర్తిగా నష్టపోతే ఇచ్చే పరి మిత పరిహారం రైతును ఎలా ఆదుకుంటుంది? నష్టాన్ని అంచనా వేసే విధానం పారదర్శకంగా ఉండాలి. భూమి యజమానులకే కాకుండా కౌలు రైతులకు కూడా న్యాయం జరగాలి. పంటల బీమా పరిహారాన్ని నెలల తరబడి పెండింగ్లో పెట్ట కుండా తక్షణమే చెల్లించాలి. వ్యవసాయ రుణాల వసూళ్లను వాయిదా వేయాలి. తదుపరి పంట సాగుకు పెట్టుబడి సాయం అందించాలి. కరువు ప్రభావం పొలాలకే పరిమితం కాదు. పంటల దిగుబడులు తగ్గితే ఆహార ధాన్యాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రైతు ఆదాయం పడిపోతుంది. కూలీలకు పనులు తగ్గుతాయి. చివరకు పేద, మధ్యతరగతి కుటుంబాల వంటగదిపై ధరల భారం పడుతుంది. ప్రస్తుతం ప్రజా పంపి ణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు బియ్యం, గోధుమలు ఉచితంగా అందుతున్నాయి. కానీ బియ్యం ఒక్కటే కుటుంబా నికి సంపూర్ణ ఆహార భద్రత కల్పించదు. కందిపప్పు, శనగపప్పు, వంటనూనె, చక్కెర వంటి నిత్యావసర సరుకులను కూడా సబ్సిడీపై అందించాల్సిన అవసరం ఉంది. కేంద్రం కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రకటించిన ప్రణాళికలు క్షేత్రస్థా యిలో అమలుకావాలి. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం ఇవ్వాలి. విత్తనాలు, ఎరువులు అందించాలి. పశువులకు పశు గ్రాసం,గ్రామాలకు తాగునీరు అందిం చాలి. ఉపాధి పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఆదాయం కల్పించాలి. కరువు అనేది ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. ఇది దేశ ఆహార భద్రతకు సంబంధించిన సంక్షోభం. ఇలాంటి సమయంలో రాజకీయ విభేదాలు, నిధుల విషయంలో వివక్ష, అధికారుల కాలయాపనకు తావుండకూడదు. కేంద్రం రాష్ట్రాలకు అండగా నిలవాలి. రాష్ట్రాలు రైతులకు నేరుగా సహా యం అందించాలి. ప్రకటించిన పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.ప్రకృతి వైపరీత్యాలను ఆపడం ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావంతో ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉ ంది. రైతు పంట పండిస్తేనే దేశానికి అన్నం అందుతుంది. రైతు నష్టపోతే దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది. ప్రకటనలతో రైతు కడుపు నిండదు.అప్పులు తీరవు. సమీక్షలతో పం టలు పండవు. కేంద్రం ఇప్పటికైనా మేల్కొనాలి. నష్టాలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి. తక్షణమే నిధులు మంజూరు చేయాలి. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి. పేదలకు నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలి. రైతు కన్నీరు తుడవని పాలనకు ప్రజల సమస్యలు పరిష్కరించిన ఘనత ఎలా దక్కుతుంది? రైతుకు భరోసా.. పేదలకు ఆహార భద్రత.. ఇవి హామీలు కాదు, ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన కనీస బాధ్యతలు.

జిల్లా పరిషత్ చైర్మెన్ ఎవరు..? అధినేత ఆశీస్సులు ఎవరికి..?

కర్నూలు :కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుంది..? కూటమి ప్రభుత్వంలో ఆ కీలక పదవిని దక్కించుకునే అదృష్టవంతులు ఎవరు..? అధినేత ఆశీస్సులు ఎవరికి లభిస్తాయి..? అనేది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి స్పష్టమైన మెజార్టీ సాధించడంతో చైర్మన్ పీఠం కూటమి ఖాతాలోకి వెళ్ళింది. అయితే టీడీపీ, బీజేపీ మధ్య సమన్వయం, సామాజిక సమీకరణాలు, సీనియారిటీ, యువ నాయకత్వానికి ప్రాధాన్యత వంటి అంశాలు చైర్మన్ ఎంపికలో కీలకంగా మారనున్నాయి. ఇప్పటికే జిల్లా ఎన్నికల పరిశీలకులు, జిల్లా అధ్యక్షురాలు, నాయకులు కలసి ఐదు మంది పేర్లు అధినేత పరిశీలనకు పంపినట్టు తెలుస్తోంది. ఐదు మందిలో అధినేత ఎవరిని ఎంపిక చేస్తారనేది ఉత్కంఠగా మారిన వైనం పై తెలుగు ప్రభ ప్రత్యేక కథనం...కర్నూలు జిల్లా లో 26 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 26 జడ్పీటీసీ స్థానాలకు గాను కూటమి పార్టీలు 20 స్థానాలను కైవసం చేసుకుని స్పష్టమైన ఆధిక్యత సాధించాయి. ఇందులో టీడీపీ 18 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. టీడీపీ మద్దతుతో కృష్ణగిరి జడ్పీటీసీ మర్రి శ్రీరాములు విజయం సాధించడంతో కూటమి బలం 20 కి చేరింది. మరోవైపు టీడీపీ రెబల్గా పోటీ చేసి గెలిచిన హోళగుంద జడ్పీటీసీ గోవింద్ గౌడ్ కూడా టీడీపీ మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కూటమి బలం 21కు చేరే అవకాశం ఉంది. ఇక వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమైంది. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం కూటమి వశం కానుంది.

చైర్మన్ రేసులో ఐదుగురు..!

జడ్పీ చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న వారి జాబితాలో ప్రస్తుతం ఐదుగురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టీడీపీ నుంచి టీడీపీ సీనియర్ నేత, కౌతాళం జడ్పీటీసీ చూడి ఉలిగయ్య, దేవనకొండ జడ్పీటీసీ షేక్ సాధికా, తుగ్గలి జడ్పీటీసీ మిద్దె గీతాకుమారి, ఆదోని జడ్పీటీసీ కురువ శంకరమ్మతో పాటు టీడీపీ రెబల్గా గెలిచిన హోళగుంద జడ్పీటీసీ గోవింద్ గౌడ్ పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉ న్నట్టు తెలుస్తోంది. వీరిలో ఎవరికి అధిష్టానం అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ కోసం పనిచేసిన అనుభవం, రాజకీయ సీనియారిటీ, సామాజిక సమీకరణాలు, స్థానికంగా ఉన్న బలం వంటి అంశాలను అధిష్టానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే సీనియర్ నేత, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కౌతాళం జడ్పీటీసీ చూడి ఉలిగయ్య కు చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే టీడీపీ రెబల్ గా పోటీ చేసిన గోవింద్ గౌడ్ కూడా మొదటి నుంచి టీడీపీ లోనే ఉన్నారు.జడ్పీటీసీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా హోళగుంద జడ్పీటీసీ కి పోటీ చేశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. టీడీపీతోనే కొనసాగుతానని చెప్పారు. అంతేకాక ఆయనకున్న పరిచయాల ద్వారా జడ్పీ చైర్మన్ కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకి ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నానని, తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. మొత్తం మీద పార్టీ కార్యక్రమాల్లో అనుభవం, రాజకీయ పరిచయాలు, క్షేత్రస్థాయిలో ఉన్న పట్టుతో పాటు నాయకత్వ లక్షణాలు వీరికి అనుకూలంగా మారవచ్చని భావిస్తున్నారు. అయితే రెబల్గా గెలిచిన గోవింద్ గౌడ్కు పార్టీ అధిష్టానం ఎలాంటి ప్రాధాన్యత ఇస్తుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

యువతకు, చదువుకున్న వారికి ప్రాధాన్యమిస్తే షేక్ సాధికా, గీతాకుమారికి ఛాన్స్.?

టీడీపీ అధినేతన, సీఎం చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేష్ యువ నాయకత్వానికి పెద్ద పీట వేస్తున్నారు. జడ్పీ చైర్మెన్ పీఠం యువతకు ఇవ్వాలని ఆలోచనతో అధిష్టానం ముందుకు వస్తే దేవనకొండ జడ్పీటీసీ డాక్టర్ షేక్ సాధికా, తుగ్గలి జడ్పీటీసీ మిద్దె గీతాకుమారి పేర్లు తెరపైకి వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన షేక్ సాధికా ప్రస్తుతం కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. ఉన్నత చదువుతో పాటు ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన మహిళ కావడమతో ముస్లిం మైనార్టీ వర్గానికి అవకాశం ఇవ్వాలని ఆ వర్గానికి చెందిన నేతలు కోరుతున్నారు. ఉన్నత చదువుతో పాటు యువ మహిళ, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన డాక్టర్ షేక్ సాధిక అవకాశాలు మెండుగా ఉ న్నాయని పలువురు చెబుతున్నారు.రాష్ట్రంలో ఎక్కడైనా మైనార్టీకి అవకాశం ఇస్తే.. ఇక్కడ దక్కే అవకాశం ఉండదని, ఎక్కడా ఇవ్వకుంటే ఇక్కడ తప్పకుండా డాక్టర్ షేక్ సాధిక కు తప్పకుండా చైర్మెన్ పీఠం దక్కే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే యాదవ సామాజిక వర్గానికి చెందిన మిద్దె గీత కుమారి కూడా డీఈడీ చదువుకుంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన యువ మహిళ. యాదవులకు కూడా అవకాశం ఇవ్వాలని ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు కోరుతున్నారు. మొత్తం మీద చదువుకున్న వారికి, మహిళా నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంటే వీరిలో ఒకరికి అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. అలాగే కురువ శంకరమ్మ పేరు కూడా ఆశావహుల జాబితాలో ఉంది. ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మెన్ మాన్వీ దేవేంద్రప్ప సోదరి శంకరమ్మ. కురువ సామాజిక వర్గానికి జడ్పీ చైర్మెన్ పీఠం ఇవ్వాలని కోరుతున్నట్టు తెలుస్తుంది. సామాజిక సమీకరణాలు చైర్మన్ ఎంపికలో ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది చర్చనీయాంశంగా మారింది.

అధినేత ఆశీస్సులు ఎవరికో..

జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపిక విషయంలో స్థానిక నాయకుల అభిప్రాయాలతో పాటు పార్టీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయమే కీలకం కానుంది. జిల్లాలోని రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, మహిళా నాయకత్వం, భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధిష్టానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆశావహులు తమకు అనుకూలంగా ముఖ్య నాయకుల వద్ద చైర్మెన్ పీఠం దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఎవరిపేరును ప్రకటించకపోవడంతో ఉ త్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 20న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు.దీంతో మరి కొన్ని రోజుల్లో జడ్పీ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. చైర్మన్ పదవి టీడీపీకి దక్కడం ఖాయంగా కనిపిస్తున్నప్పటికీ అభ్యర్థి ఎంపిక మాత్రం అధిష్టానానికి సవాల్గా మారింది. సీనియర్లకు పట్టం కడతారా..? యువ నాయకత్వానికి అవకాశం ఇస్తారా..? మహిళా నేతకు జడ్పీ పగ్గాలు అప్పగిస్తారా..? అన్నది వేచి చూడాలి. మొత్తంగా జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో..? అధినేత ఆశీస్సులు ఎవరికి లభిస్తాయో..? తెలియాలి అంటే ఈ నెల 20 వరకు వేచి చూడాల్సిందే..!!!

లాభాల్లో ఉన్నా అమ్మకాలేనా?



హైదరాబాద్,ప్రభుత్వ రంగ సంస్థలు కేవలం లాభనష్టాల లెక్కలకు పరిమితమైన వ్యాపార సంస్థలు కావు.. అవి దేశ ఆర్థిక స్వావలంబనకు, ప్రజల ఉపాధికి, సామాజిక భద్రతకు పునాదులు. దశాబ్దాల పాటు ప్రజాధనంతో నిర్మించిన సంస్థలు లాభాల బాటలో పయనిస్తున్నప్పటికీ వాటాల విక్రయానికి ప్రభుత్వం ఎందుకు మొగ్గుచూపుతోంది? తక్షణ ఆదాయం కోసం దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టడం సమంజసమేనా? ఐడీబీఐ బ్యాంకు విక్రయం నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై చర్చ అనివార్యమవుతోంది.భారతదేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ప్రభుత్వం చెబుతున్న సమయంలో, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను విక్రయించడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. నష్టాల్లో ఉన్న సంస్థలను పునరుద్ధరించడం సాధ్యం కానప్పుడు విక్రయించడంపై చర్చించవచ్చు. కానీ లాభాలు ఆర్జిస్తున్న సంస్థలను కూడా ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏమిటన్నదే ప్రధాన ప్రశ్న.

లాభాల్లో బ్యాంకులు.. అయినా ప్రైవేటీకరణ ఎందుకు?

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం 2022-23లో రూ.1.05 లక్షల కోట్లుగా ఉండగా, 2024-25లో రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. 2025-26లోనూ సుమారు రూ.1.98 లక్షల కోట్ల లాభాలు నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ గణాంకాలు ప్రభుత్వ రంగ బ్యాంకులు లాభాలను ఆర్జించగల సామర్థ్యం కలిగి ఉన్నా యని సూచిస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభా లను గ్రామీణ రుణాల విస్తరణకు, వ్యవసాయానికి, చిన్న వ్యాపారాలకు, విద్యా రుణాలకు, ఉపాధి కల్పనకు వినియోగించవచ్చు. నిర్వహణ సామర్థ్యం పెంచడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం అవసరమే. అయితే, ఆ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వ యాజమాన్యాన్ని తగ్గించడమే ఏకైక మార్గమా అన్నది పరిశీలించాలి.

ఐడీబీఐ బ్యాంకు విక్రయం.. కీలక వివరాలు

ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ కలిపి తమ వాటాలో 60.72 శాతాన్ని సుమారు రూ.52,878 కోట్లకు విక్రయించే ప్రక్రియను చేపట్టాయి. ఫెయిర్ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు చెందిన సంస్థను వ్యూహాత్మక కొనుగోలుదారుగా కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ 2026 అక్టోబర్ 14న ఆమోదించినట్లు ప్రక టించారు. ఈ వాటాలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం, ఎల్ఐసీకి చెందిన 30.24 శాతం ఉన్నాయి. ఒక్కో షేరుకు రూ.81 చొప్పున బిడ్‌ను ఆమోదించారు. లావా దేవీ పూర్తయితే కేంద్ర ప్రభుత్వానికి 15 శాతం, ఎల్ఐసీకి 19 శాతం వాటా మిగులుతుంది. అయితే, సంబంధిత నియంత్రణ సంస్థల అనుమతులు, ఇతర ప్రక్రియలు పూర్తయ్యాకే విక్రయం అమల్లోకి వస్తుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వానికి ఒకేసారి భారీ మొత్తం లభించవచ్చు. కానీ భవిష్యత్తులో వచ్చే డివిడెండ్ ఆదాయం, బ్యాంకుపై ప్రభుత్వ నియంత్రణ తగ్గే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఉపాధి.. సామాజిక భద్రతకు సవాలు

స్వాతంత్ర్యం తర్వాత ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధితోపాటు లక్షలాది మందికి ఉపాధి కల్పించాయి. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం మాత్రమే కాదు.. ఉద్యోగ భద్రత, సేవా నిబంధనలు, పదవీ విరమణ ప్రయోజనాలు కూడా. గణాంకాల ప్రకారం, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగుల సంఖ్య, ప్రభుత్వ గణాంకాలు పరిశీలిస్తే, 2014-15లో 8,44,454గా ఉండగా, 2024--25లో 7,58,172కు తగ్గింది. అదే సమ యంలో శాఖల సంఖ్య 85,895 నుంచి 86,535కు పెరిగినట్లు సూచిస్తోంది. శాఖలు పెరుగుతున్న సమయంలో ఉద్యోగుల సంఖ్య తగ్గడంపై చర్చ అవసరం. డిజిటల్ బ్యాంకింగ్, ఆటోమేషన్ వల్ల కొన్ని పనులకు సిబ్బంది అవసరం తగ్గవచ్చు. శాశ్వత నియామకాలను తగ్గించి ఔట్సోర్సింగ్ పెంచితే ఉద్యోగుల వేతనాలు, భద్రత, సంక్షేమ ప్రయోజనాలు ప్రభావితమయ్యే ప్రమా దం ఉంది.

ఆదాయమే కాదు.. ప్రజా ప్రయోజనమూ ముఖ్యం

ప్రైవేటీకరణ వల్ల పెట్టుబడులు, సాంకేతికత, నిర్వహణ సామర్థ్యం పెరుగుతాయని అనుకూలవాదులు చెబుతున్నారు. మరోవైపు, వాటాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయం ఒకసారి మాత్రమే లభిస్తుంది. పన్నులు, డివిడెండ్లు మాత్రం నిరంతర ఆదాయ వనరులుగా ఉండగలవు. అందువల్ల విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఎక్కడ, ఎలా వినియోగిస్తున్నారో ప్రభుత్వం పారదర్శకంగా వెల్లడించాలి. ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకించడం ఎంతవరకు సరైనది కాదో, లాభాల్లో ఉన్న సంస్థలను విచక్షణారహితంగా విక్రయించడం కూడా అంతే ప్రమాదకరం. సంస్థల ఆర్థిక స్థితి, ప్రజా ప్రయోజనం, ఉద్యోగుల భద్రత, దీర్ఘకాలిక ఆదాయాన్ని బేరీజు వేసి నిర్ణయాలు తీసుకోవాలి. సంక్షేమ రాజ్యం అంటే పథకాలు ప్రకటించడం మాత్రమే కాదు.. ఉపాధి కల్పించడం, ఆర్థిక భద్రతను అందించడం, ప్రజాధనంతో నిర్మించిన ఆస్తుల ప్రయోజనాలను సమాజానికి అందిం చడం కూడా. ప్రభుత్వ రంగ సంస్థల భవిష్యత్తుపై నిర్ణ యాలు తీసుకునేటప్పుడు తక్షణ ఆదాయాన్ని మాత్రమే కాకుండా, దేశానికి దీర్ఘకాలంలో కలిగే లాభనష్టాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

బైకులకు నిప్పు అంటించిన ఆకతాయిలు

హైదరాబాద్,ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి వేళ ఆకతాయిలు సృష్టించిన భయాందోళన స్థానికులను తీవ్రగ్రాబ్బంతికి గురిచేసింది. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు దుండగులు కావాలనే నిప్పు పెట్టి పరారయ్యారు.సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి దాటిన తర్వాత నివాసాల ముందు పార్క్ చేసి ఉన్న రెండు బైక్లపై దుండగులు నిప్పు రాజేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఆర్పివేసే ప్రయత్నం చేసినప్పటికీ, ఒక బైక్ పూర్తిగా కాలి బూడిదవ్వగా, మరొక బైక్ పాక్షికంగా దగ్ధమైంది.ఈ ఘాతకానికి పాల్పడిన దుండగులు బైక్స్కు నిప్పు పెట్టి అక్కడ నుంచి పరారవుతున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా

పరిషత్ ఎన్నికల్లో అంచనాలు తారుమారు...

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి పార్టీలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో కనిపించిన ఆధిపత్యం పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు, గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ వరకు కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. అధికారికంగా పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు టికెట్లు దక్కక స్వతంత్రులుగా పోటీ చేసిన కూటమి నాయకులు కూడా గెలవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా కనిపించింది.సాధారణంగా ఒకే పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉంటే ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి పార్టీకి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. ఈ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి తమకు అనుకూలిస్తుందని వైసీపీ నాయకత్వం ఆశించి ఉండవచ్చు. అయితే ఫలితాలు మా త్రం అందుకు భిన్నంగా వచ్చాయి. అధికారిక అభ్యర్థితో పాటు రెబల్గా పోటీ చేసిన నాయకుల్లో ఒకరిని ఓటర్లు ఆదరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు కూటమి అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పటికీ వైసీపీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కలేదు.నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేట, జలదంకి, ఆత్మకూరు, వెంకటాచలం మండలాల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా తెలుగుదేశం పార్టీనుంచి టికెట్ ఆశించి, అవకాశం దక్కకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగినవారే కావడం గమనార్హం. శ్రీకాకుళం జిల్లాలోనూ రెబల్ అభ్యర్థుల ప్రభావం స్పష్టంగా కనిపించింది. అక్కడ ఏకంగా 16 మంది స్వతంత్రులు గెలుపొందగా, వారిలో అత్యధికులు టీడీపీకి చెందినవారే కావడం పార్టీ స్థానిక బలాన్ని సూచిస్తోంది.తిరుపతి జిల్లాలో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో ఐదుగురు టీడీపీకి, మరొకరు జనసేన పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థిగా ఉన్నారు. కాకినాడలో ఐదుగురు, పిఠాపురంలో ఒకరు, తూర్పుగోదావరి జిల్లాలో నలుగురు టీడీపీ, జనసేన తిరుగుబాటు అభ్యర్థులు గెలిచారు. విజయనగరం జిల్లాలో పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. అక్కడ ఏకంగా 28 మంది స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని అందుకున్నారు. కృష్ణా జిల్లాలో కూడా ఎనిమిది మంది స్వతంత్రులు తమ సత్తా చాటారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు అందిన ఫలితాల ప్రకారం 66 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. తుది లెక్కల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. వీరిలో అధిక శాతం మంది కూటమి పార్టీలకు చెందిన అసంతృప్త నాయకులు కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులకు మాత్రమే కాకుండా, స్వతంత్రులుగా బరిలోకి దిగిన నాయకులకు కూడా ప్రజల మద్దతు లభించడం స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.ఈ ఫలితాలు వైసీపీకి మాత్రం ఆశించిన ఊరటనివ్వలేకపోయాయి. కూటమి అభ్యర్థుల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలి తమకు అవకాశాలు వస్తాయని భావించిన నాయకులకు ఫలితాలు నిరాశ కలిగించాయి. స్థానిక స్థాయిలో అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, ప్రజలతో ఉన్న సంబంధాలు కూడా విజయాల్లో కీలక పాత్ర పోషించాయి. మొత్తంగా పరిషత్ ఎన్నికలు కూటమి పార్టీలకు బలమైన రాజకీయ సంకేతాన్ని ఇచ్చాయి. అధికారిక అభ్యర్థులైనా, రెబల్స్ అయినా కూటమి శిబిరం నుంచే ఎక్కువ విజయాలు రావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది.

ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

హైదరాబాద్,ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉ న్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ంఖిఎ ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించ

మమతకు ఢిల్లీ పోలీసుల నోటీసులు..

పశ్చిమబెంగాల్ మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. 2013లో పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌లో నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని కోరుతూ.. ఈ నోటీసులు అందజేశారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) సెక్షన్ 160 కింద ఈ నోటీసులు జారీ చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. విచారణాధికారిని ఎప్పుడు, ఎక్కడ కలవాలన్నది ఆమె సౌకర్యానుసారం నిర్ణయించుకోవచ్చని సూచించారు. అసలేం జరిగిందంటే?: 2013లో ఢిల్లీలోని నాటి ప్రణాళికా సంఘం కార్యాలయం సమీపంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆ సమయంలో మమత తన పార్టీ నేతలు, మంత్రులతో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆమె బృందాన్ని చుట్టుముట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. అప్పటి బెంగాల్ ఆర్థిక మంత్రి అమిత్ మిత్రాపై దాడి చేసి, దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రాగా.. ఈ ఘటనపై పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, ఉద్యోగులపై దాడి చేయడం, అల్లర్లు సృష్టించడం వంటి అభియోగాలతో ఐపీసీ సెక్షన్లు 186, 353, 332, 147, 149, 34 కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో నాటి ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రితబ్రత బెనర్జీని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే.. ఈ కేసులో మమత పాత్రపై మరిన్ని వివరాలు సేకరించేందుకు పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయాలని భావిస్తున్నారు. కేసుకు సంబంధించిన పరిస్థితులపై ఆమెకు అవగాహన ఉందని, అందుకే సాక్షిగా విచారణకు సహకరించాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసులపై మమత లేదా టీఎంసీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

పవన్ కల్యాణ్ అనా విడాకులు ..

గతాన్ని గుర్తు చేసుకుంటూ ఫ్యాన్స్ ఎమోషనల్

హైదరాబాద్, ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తన భార్య అనా లెజినోవా కొణిదెలతో విడిపోతున్నట్లు చేసిన ప్రకటన అభిమానులను షాకింగ్‌కు గురి చేసింది. సోమవారం రాత్రి వచ్చిన ఉమ్మడి ప్రకటన ఒక్కసారిగా సోషల్ మీడియానే షేక్ చేసింది. గత రాత్రి నుంచి ఫ్యాన్స్, నెటిజన్స్ దీని గురించే తెగ సెర్చ్ చేస్తుండడంతో 'చీ'లో చఖజీలిజీనిఎజీశ్రీఎజీని, ఎఆతిలనీతీఇవ ట్యాగ్స్ ట్రెండ్ అవుతున్నాయి.పవన్, అనా కొణిదెల ఎంతో అన్యోన్యంగా ఉండేవారని... పాలిటిక్స్, పాలనలో బిజీగా ఉన్న టైంలోనూ ఆయనకు సపోర్ట్‌గా ఉండేవారని ఫ్యాన్స్ గుర్తు చేసుకుంటున్నారు. కూటమి విజయం సాధించిన తర్వాత మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు వెళ్లిన పవన్... ఆయన ఆశీర్వాదం తీసుకుంటుండగా... చెప్పులను పక్కన పెడితే వాటిని అనా కొణిదెల తన చేత్తో పట్టుకున్న వీడియోలు షేర్ చేస్తున్నారు.అలాగే, కొడుకు మార్క్ శంకర్ ఫైర్ యాక్సిడెంట్ టైంలో ప్రమాదం నుంచి బయటపడి కోలుకున్న తర్వాత స్వయంగా తిరుమల వెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. హిందూ సంప్రదాయం, సంస్కృతి పాటిస్తూ డిక్లరేషన్ ఇచ్చి మరీ గుండు గీయించుకుని స్వామిని దర్శించుకున్నారు. అన్నదానంలో భాగంగా భక్తులకు స్వయంగా అన్న ప్రసాదం వడ్డించారు. ఈ వీడియోలు వైరల్ కాగా... పవన్‌పై ఉన్న ప్రేమ, గౌరవం, అభిమానానికి ఇదే నిదర్శనమని... కలకాలం ఇలాగే ఉండాలంటూ మురిసిపోయారు.రీసెంట్‌గానే ఇన్ స్టా అకౌంట్ ఓపెన్ చేసిన అనా లెజినోవా... తన పేరును సైతం అనా కొణిదెలగా మార్చుకున్నారు. మెగాస్టార్ చిరు బర్త్ డే సందర్భాల్లో స్పెషల్ విషెష్ చెబుతూ బెస్ట్ మూమెంట్స్‌ను పంచుకునేవారు. ఫ్యామిలీపై తనకున్న గౌరవాన్ని కూడా చూపించారు. అప్పుడప్పుడూ పవన్‌పై తన ప్రేమ ప్రతిబింబించేలా పోస్టులు పెట్టేవారు. అయితే, డివోర్స్ అనౌన్స్ టైంలో అనా కొణిదెల ఇన్ స్టా అకౌంట్ కనిపించడం లేదు. ఆమె తన అకౌంట్ డిలీట్ చేశారా? లేదా డీయాక్టివేట్ చేశారా? అని నెటిజన్స్ చర్చించుకుంటున్నారు.పాలిటిక్స్‌లో బిజీగా? ఉన్న టైంలోనూ, గెలిచి డిప్యూటీ సీఎంగా మారి పాలనలో బిజీగా ఉన్న సమయంలో పవన్‌కు అన్ని విధాలా అండగా ఉండి, అమితమైన ప్రేమ, గౌరవం చూపించిన అనా... ఆయన నుంచి విడిపోవడాన్ని చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఉమ్మడి డివోర్స్ ప్రకటన ఫేక్ అయితే బాగుండేది అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరికొందరు ఇది వారి పర్సనల్ విషయమని... తప్పు ఒప్పులను బయట ఉండి జడ్జ్ చేయలేమంటూ కామెంట్స్ చేస్తున్నారు.

సిటీలో హై-ఎండ్ ఓవర్ సప్లై

హైదరాబాద్, కోవిడ్ తదుపరి కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రూ. 2 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన లగ్జరీ,అల్ట్రా-లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపించింది. దాంతో ప్రముఖ బిల్డర్లు, డెవలపర్లు అంతా తమ దృష్టిని లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలపైనే కేంద్రీకరించారు. అయితే, ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడం , వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవ్వడంతో ప్రస్తుతం భాగ్యనగరంలో లగ్జరీ విభాగంలో అమ్ముడవని గృహాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయి హై-ఎండ్ ఓవర్ సప్లై పరిస్థితి ఏర్పడింది.నగరంలో భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో పాటు ఇళ్ల ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరిగిపోవడం కొనుగోలుదారుల్లో నిరాశను నింపింది. రూ. 2 కోట్ల పైబడిన ఆస్తులను కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న ఉన్నత వర్గాల డిమాండ్ ఒక స్థాయికి చేరుకుని సంతృప్త స్థితికి రావడంతో, మార్కెట్‌లో భారీగా నిర్మించిన లగ్జరీ ఫ్లాట్లు అమ్ముడవకుండా మిగిలిపోతున్నాయి. ఇది డెవలపర్ల మూలధనం నిలిచిపోయేలా చేసి, ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది.ఈ సవాలును అధిగమించేందుకు నగర రియల్టర్లు తమ వ్యూహాన్ని వేగంగా మార్చుకుంటున్నారు. విలాసవంతమైన లగ్జరీ నిర్మాణాల కంటే నిజమైన కొనుగోలుదారులు అధికంగా ఉన్న 70 లక్షల నుంచి 1.20 కోట్ల బడ్జెట్ ప్రాజెక్ట్‌లను డిజైన్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మధ్యతరగతి , ఎగువ-మధ్యతరగతి ఉద్యోగులు, ఐటీ రంగానికి చెందిన యువ కొనుగోలుదారు ల బడ్జెట్‌కు తగినట్లుగా 2ఱఱఐ, 3ఱఱఐ ఫ్లాట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ కారిడార్లకు కాస్త దూరంగా ఉన్న గ్రోత్ కారిడార్లు, నివాన ప్రాంతాలలో ఈ మిడ్-సెగ్మెంట్ గృహాల నిర్మాణాలు వేగవంతమవుతున్నాయి. అనవసరమైన విలాసవంతమైన ఆమేనిటీస్‌ను తగ్గించి, స్థల వృధా లేకుండా సమర్థవంతమైన లేఅవుట్లతో అందుబాటు ధరల్లో ఇళ్లను అందించడం ద్వారా మార్కెట్‌లో నిలిచిపోయిన క్రయవిక్రయాలకు మళ్లీ ఊపిరి పోయవచ్చని రియల్ ఎస్టేట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను మరింత సుస్థిరమైన దారిలో నిలబెడుతోంది.

కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు

మేడ్చల్-మల్కాజిగిరి, నేటి నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్టకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు.కార్తీక మాసం ప్రారంభం కావడంతో కీసరగుట్టలో భక్తి సందడి నెలకొంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది.

ఇక ఓటర్ కార్డే ఆధారమా?!

న్యూఢిల్లీ,తెల్ల రేషన్ కార్డుల ప్రాతిపదికన అరకొరగా ఇస్తూ వచ్చిన సంక్షేమ పథకాలు సైతం అనర్హులకు పోతున్నాయని పదిహేనేళ్ల క్రితంవరకూ పాలకులు అనుమానించేవారు. ఈ నేపథ్యంలోనే ఆధార్ రంగ ప్రవేశం చేసింది. ఇప్పుడు దానిపై కూడా శంకలు మొదలై నట్టున్నాయి. ఇకపై ఓటర్ గుర్తింపు కార్డున్నవారికే సంక్షేమ పథకాలివ్వాలని యోచిస్తున్నామంటూ కేంద్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ శుక్రవారం బాంబు పేల్చారు. దేశంలో నిరుడు నవంబర్ నుంచీ వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం (ఈసీ) ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరిట అమలుచేస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ ఎన్ని అవకతవకలతో నిండివుంటున్నదో, దానివల్ల జనం ఎన్ని కడగండ్లు అనుభవిస్తున్నారో ఆయనకు తెలియదనుకోవాలా? ఇంతకూ ఆధార్ ఎందుకు పనికి రాదనుకుంటున్నారు? ఏ కేంద్రానికెళ్లినా అయిదు నిమిషాల్లో ఆధార్ సంపాదించ వచ్చన్నది కేంద్రమంత్రి వాదన. పరిస్థితి ఇలావుంటే దాన్ని సరిచేయాల్సింది ప్రభుత్వమే. అంతేతప్ప దాన్ని గుర్తించబోమనటం సరికాదు. ఏ కేంద్రానికెళ్లినా ఫలానా పత్రం ఉంటే తప్ప ఆధార్ ఇవ్వబోమని చెప్పడం నిత్యం అందరికీ కనబడుతూనే ఉంటుంది. ఇలా వాటి చుట్టూ పడిగాపులు పడుతున్నవారు సామాన్యులు. కానీ కొన్నేళ్లక్రితం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనడానికొచ్చిన 'పెద్ద మనుషులు' ఒక్కొక్కరిదగ్గరా వేర్వేరు పేర్లతో పలు ఆధార్ కార్డులుండటం తెలంగాణలో చానెళ్ల సాక్షిగా బయటికొచ్చింది. అడపాదడపా బంగ్లాదేశీయులో, మరొకరో ఆధార్ సంపాదిన్నున్న వైనాలూ బయటపడుతున్నాయి. నిజమే. ఈ నేరాన్ని నిరోధించటానికి బదులు మొత్తానికే ఆధార్ పక్కనబెట్టడం

సరైందేనా?

అసలు ఆధార్ కార్డుపై అయోమయం ఈనాటిది కాదు. మహారాష్ట్రలోని తెంబ్లీలో 2010లో ఆ పథకాన్ని స్వయంగా ప్రారంభించిన అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కే దానిపై మూడునాలుగేళ్లు గడిచాక కూడా స్పష్టత లేదు. సంక్షేమ పథకాలు అందాలన్నా, బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలన్నా... ఇతరేతర అంశాల్లో గుర్తింపు కావాల్సిన సంద ర్భాలొచ్చినా అది పనికొస్తుందని మొదట్లో చెప్పిన ఆయన... మరికొన్నాళ్లకు ఆ కార్డు తీసుకోవటం ఐచ్ఛికమేనని, ఉండితీరాలని ఎవరినీ పట్టుబట్టబోమని స్వరం మార్చారు. ఇన్నాళ్లు గడిచినా ఇంకా గందరగోళం ఆశ్చర్యకరం. ఆ సంగతలావుంచి ఓటర్ గుర్తింపు కార్డు మాత్రం 'సచ్ఛీలమైనద'ని ఎలా చెప్పగలుగుతారు? సర్ పూర్తయినచోట అర్హులైన లక్షలమంది తమ పేర్లు



అన్యాయంగా తొలగించారని మొరబెట్టుకుంటున్నారు.బెంగాల్‌లో అయితే జనం ట్రిబ్యునళ్ల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. మరోపక్క ఒకే ఇంటి చిరునామాతో వందలాదిమంది ఓటర్లున్న ఉదంతాలూ, జంతు వుల పేరిట గుర్తింపు కార్డులు తయారైన ఉదంతాలూ పలుచోట్ల బయటపడ్డాయి. వాస్తవం ఇదికాగా ఓటర్ కార్డుకు కేంద్ర మంత్రి మరీ అంతగా భుజకీర్తులు తగిలించటం తొందరపాటు.అసలు పౌరసత్వాన్ని తేల్చటానికి ప్రత్యేక చట్టాలు, ప్రత్యేక వ్యవస్థలూ ఉండగా... ఈసీ గుర్తింపు కార్డు ఆధారంగా పౌరులో కాదో నిర్ధారించుకుని, ఆ ప్రాతిపదికనే సంక్షేమం ఇస్తామనటం ఎలా చూసినా సరికాదు. ఓటర్ల జాబితాల ఉద్దేశం ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రమే. ఒక ప్రయోజనం కోసం ఉద్దేశించినదాన్ని మరొకందుకు వినియోగించటం చట్టవిరుద్ధమని బెంగాల్ సర్కారు తీరుపై దాఖలైన పిటిషన్లను విచారిస్తూ ఆర్నెల్ల క్రితం సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. అయినా ఈ విషయంలో ముందుకెళ్లాలనుకోవటం అన్యాయం. బయోమెట్రిక్‌ను సర్వరోగ నివారిణిగా చూడటమైనా సమస్యే. సీనియర్ సిటిజన్‌ల బయోమెట్రిక్ నిర్ధారణ ఎంత సమస్యాత్మకంగా ఉంటున్నదో ఎవరికీ తెలియనిది కాదు. అలాంటివారికి రేషన్ మొదలుకొని పెన్షన్లవరకూ ఏదీ దక్కనీయరాదని నిర్ణయించటంలోని హేతుబద్ధత ప్రశ్నార్థకం. సంక్షేమానికయ్యే నిధుల్ని కత్తిరించాలనుకుంటే వేరేసంగతి.ఇప్పటికే పదమూడున్నర కోట్లమందికి ఓటు పోయింది. సర్ ప్రక్రియ సాగు తున్న వేరేచోట్ల మరింతమంది వీరికి తోడవుతారు. ఇలాంటివారంతా అనివార్యంగా ఉద్యమ కారులవైపు చూస్తారు. నక్సలిజాన్ని అంతమొందించామంటున్న కేంద్రం అలాంటి మరో సమస్యకు బీజం పడే నిర్ణయం తీసుకోబోదని ఆశించాలి.

ఇంకెన్నిళ్లు ఎదురుచూపులు..?



నిర్మల్ :చదువులతల్లి జ్ఞాన సరస్వతిదేవి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా పరిశీలనలో ఉన్న యూనివర్సిటీ ఏర్పాటు మంజూరయ్యే దశలో రాజకీయ జోక్యంతో వెనక్కి పోయింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యావకాశాలు బలోపేతం చేయక పోగా ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది.శ్యామ్ పిట్రోడా నేతృత్వంలోని జాతీయ విజ్ఞాన కమీషన్ నివేదిక ప్రకారం ప్రతి జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు అవసరమన్నారు. కాని ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీల్లో నియామకాలు గత పదేళ్లుగా నిలిచిపోయాయి. సగానికి పైగా ఖాళీలు, అరకొర నిధులతో నెట్టుకొస్తున్నారు.

కొత్త విశ్వవిద్యాలయాల ఏర్పాటు గాలికే.!

కొత్తగా జిల్లాకో రాష్ట్ర విశ్వవిద్యాలయం ఏర్పాటును పక్కనపెట్టి ప్రైవేటుకు మద్దతు ఇవ్వటంతో ఉన్నతవిద్య భారంగా మారింది. దీంతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. విశ్వవిద్యాలయం పరిధిలో 200 పైగా కళాశాలలు ఉంటే కొత్త విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రం సూచించింది. ఇందుకోసం యూజీసీ 'రూసా' పథకం ద్వారా నిధులు కేటాయిస్తామన్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో నిర్మల్ లోని విశ్వవిద్యాలయ పీజీ కళాశాలను యూనివర్శిటీగా ఉన్నతీకరించేందుకు అవకాశముందని భావించారు.

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చినా

2009 లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇందుకు అంగీకరించింది. 2013 లో రూసా పథకం కింద రూ.55 కోట్ల నిధులను సైతం కేటాయించారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాలతో ఈ ప్రతిపాదన మార్చేందుకు నేతలు యత్నించారు. ఆ సమయంలో మంత్రిగా ఉన్న జోగు రామన్న జోక్యంతో ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వవిద్యాలయ ఏర్పాటుకి నిర్ణయం, కేంద్రం అంగీకరించకపోవడంతో రూసా నిధులు వెనక్కు మళ్ళాయి. గిరిజనులున్న ఈ జిల్లాలో ఉట్నూరు కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించి సర్వే చేసింది. రాజకీయ జోక్యంతో ఉమ్మడి వరంగల్ కు తరలించారు. పిజి కళాశాలను యూనివర్సిటీగా ఉన్నతీకరణ చేస్తారన్న నేతల అవగాహనలేమితో రాష్ట్రానికి మంజూరైన యూనివర్సిటీలు, నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

'విశ్వవిద్యాలయాల పరిధి' మారేదెన్నడు

ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా తొలుత ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఉండేది. ఆ తర్వాత వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుసంధానం చేశారు. అయితే దూరాభారం, వ్యయప్రయాసల కారణంగా విద్యార్థులు ఆదిలాబాదును తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలో చేర్చాలని కోరారు. గతంలో తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలోకి తెచ్చినా మంచిర్యాల వాసులు వ్యతిరేకించారు. ఫలితంగా మూడునెలల అనంతరం తిరిగి కాకతీయ పరిధిలోకి చేర్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని విద్యార్థుల గోడు పట్టించుకోకుండా జిల్లాను వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోకి మారుస్తూ ఆదాయ వనరుగా భావిస్తున్నారు. ఇక్కడ ఉన్నత విద్యావంతులు ఉన్నా విశ్వ విద్యాలయాల్లోని ప్రాంతీయ భేదాల కారణంగా జిల్లావాసులకు ఉద్యోగావకాశాలు దక్కడం లేదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ నెరవేరేనా?

ఇదిలా ఉంటే ఈ ఏడాది ప్రారంభంలో జిల్లాకు వచ్చిన సి ఎం రేవంత్ రెడ్డి బాసర ట్రిపుల్ ఐటీ లో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని సభాముఖంగా ప్రకటన చేశారు. ఐతే ఈ ప్రకటన కార్యరూపం దాల్చేందుకు విద్యావంతులు, మేధావులు ఎదురు చూస్తున్నారు.

ఎల్‌నినో నుంచి తుపాన్ల దాకా.. రైతుకు వరుస కష్టాలు

సత్తుపల్లి, ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను అడుగడుగునా వెంటాడుతున్నాయి. మొన్నటి వరకు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సాగునీటి కోసం అష్టకష్టాలు పడిన రైతులకు, తాజాగా తుపాన్లు, భారీ వర్షాలు మరో రూపంలో కష్టాలను తెచ్చిపెట్టాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.ఆరుగాలం శ్రమించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడం, నేలంతా బురదమయంగా మారడంతో వరి కోతలు చేపట్టడం రైతులకు పెద్ద సవాలుగా మారింది. సాధారణంగా కూలీలతో సులభంగా పూర్తయ్యే కోత పనులకు ప్రస్తుతం అదనపు శ్రమ, సమయం, ఖర్చు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది.బురదలో యంత్రాలు దిగబడిపోతుండటంతో హార్వెస్టర్ల ద్వారా కోతలు చేపట్టడం కష్టతరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కూలీలతో కోతలు చేయించాల్సి రావడంతో ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. కోసిన ధాన్యాన్ని పొలాల నుంచి బయటకు తీసుకురావడం, ఆరబెట్టడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం కూడా రైతులకు తలకు మించిన భారంగా మారింది. రోజుల తరబడి పొలాల్లోనే పంట ఉండటంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే సాగు పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులకు, ఇప్పుడు పెరిగిన కోతల ఖర్చులు మరింత భారంగా మారాయి. పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళనతో పాటు, పంట చేతికొచ్చినా దాన్ని ఇంటికి చేర్చుకునేందుకు పడుతున్న కష్టాలు రైతులను కలవరపెడుతున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడం, కూలీల కొరత, యంత్రాలతో కోతలకు ఆటంకాలు కలిసి రైతులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి.

ప్రకృతి పరీక్షలకు పరిష్కారం ఎప్పుడు?



ఒకవైపు వర్షాభావం, మరోవైపు అతివృష్టి.. ఈ రెండు పరిస్థితుల మధ్య అన్నదాతల వ్యవసాయం అగమ్యగోచరంగా మారుతోంది. పంట సాగు నుంచి కోతల వరకు ప్రతి దశలోనూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. పంట నష్టాల అంచనా వేసి అర్హులైన రైతులకు తగిన పరిహారం అందించాలని, తడిసిన ధాన్యం కొనుగోలులో నిబంధనల పేరుతో ఇబ్బందులు పెట్టకుండా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి ప్రకోపానికి నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, కోతలు, ధాన్యం రవాణా, కొనుగోళ్ల విషయంలో అవసరమైన సహకారం అందించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాసనమండలిలో పట్టభద్రుల గొంతుకనవుతా

వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు ప్రజా ఉద్యమకారుడు, హైకోర్టు న్యాయవాది డా. నల్లమాస కృష్ణ గౌడ్ ప్రకటించారు. ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థులు, యువజనులతో కలిసి ర్యాలీగా బయలుదేరి గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

రియల్ ఎస్టేట్ 'గోల్డ్ రష్'

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం వేగవంతం కావడం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊహించని క్రేజ్ వచ్చింది. ముఖ్యంగా ఐటీ కంపెనీల ఏర్పాటు,ప్రభుత్వ పరిపాలనా భవనాలు, నాలెడ్జ్ హబ్‌ల పనులు తుది దశకు చేరుకుంటుండటంతో అమరావతి పరిసర ప్రాంతాల్లో భూములు, స్థిరాస్తుల కొనుగోలుకు విపరీతమైన పోటీ నెలకొంది. రాయపూడి, తుళ్లూరు, మంగళగిరి , విజయవాడ-గుంటూరు జాతీయ రహదారి పొడవునా ఓపెన్ ప్లాట్లు, విల్లాల విక్రయాలు జోరందుకున్నాయి.రాజధాని కోర్ సీఆర్డీఏ పరిధిలోని రాయపూడి, తుళ్లూరు ప్రాంతాల్లో లేఅవుట్ల నిర్మాణం, ప్రైవేటు గృహ నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా ఊపందుకున్నాయి. ఒకప్పుడు మందగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడు సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ప్రధాన రహదారుల అనుసంధానం, నిరంతర విద్యుత్, డ్రైనేజీ , తాగునీటి వ్యవస్థల పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరుగుతుండటంతో పెట్టుబడిదారులు, సామాన్య గృహ కొనుగోలుదారులు అమరావతిలో ప్లాట్లు కొనుగోలు చేయడానికి అమితాసక్తి చూపుతున్నారు.మరోవైపు మంగళగిరి రీజియన్ నుంచి విజయవాడ-గుంటూరు హైవే బెల్ట్ ఆస్తి కొనుగోలుదారులకు ప్రధాన కేంద్రంగా మారింది. ఐటీ పార్కులు, అంతర్జాతీయ విద్యా సంస్థలు, ఆసుపత్రులు సమీపంలోనే ఉండటంతో ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు,లగ్జరీ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులకు డిమాండ్ ఆకాశాన్నంటింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఓపెన్ ప్లాట్ల ధరలు గత కొద్ది నెలల్లోనే గణనీయంగా పెరిగాయి. రాబోయే కాలంలో ఈ కారిడార్ ఐటీ , వాణిజ్య రంగానికి ప్రధాన హబ్‌గా మారనుండటంతో పెట్టుబడులపై అధిక రాబడి వస్తుందని బయ్యర్లు భావిస్తున్నారు.మొత్తానికి ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరం రూపుదిద్దుకుంటున్న వేళ.. అమరావతి పరిసర ప్రాంతాలు రియల్ ఎస్టేట్ హబ్‌గా సరికొత్త కాంతిని సంతరించుకున్నాయి. స్థానిక బిల్డర్లు, జాతీయ స్థాయి డెవలపర్లు భారీ ప్రాజెక్టులతో అమరావతిలో ల్యాండ్ అవుతుండటంతో ఉపాధి అవకాశాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. రాయపూడి నుండి మంగళగిరి వరకు సాగుతున్న ఈ రియల్ ఎస్టేట్ 'గోల్డ్ రష్' రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత ఖరీదైన, ఆధునికమైన మైక్రో మార్కెట్‌గా రూపాంతరం చెందడం ఖాయంగా కనిపిస్తోంది!

రూ.66కే బియ్యం

నిజామాబాద్, బియ్యం ధరలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం ధరలకు గరిష్ట పరిమితులు విధించింది. కొంతమంది ఎక్కువ ధరలకు బియ్యాను విక్రయిస్తున్న క్రమంలో దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బియ్యం ధరలను ఫిక్స్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలులోపే బియ్యం విక్రయించాలి. అంతకంటే అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. బియ్యం రకాలను బట్టి గరిష్ట ధరలను ఫిక్స్ చేసింది. అలాగే బియ్యం బస్తాలపై గరిష్ట చిల్లర ధరలను కూడా ముద్రించాల్సిందేనని ఆదేశించింది. అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. బియ్యం ధరల్లో మోసాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించింది.బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యంకు సంబంధించి కిలో గరిష్ట ధర రూ.66గా ఫిక్స్ చేసింది. ఇక ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం కిలో గరిష్ట ధర రూ.74గా పరిమితి విధించింది. అలాగే హెచ్ఎంటీ, జైశ్రీరాం రకం బియ్యం గరిష్ట చిల్లర ధర రూ.79గా నిర్ణయించింది. ఎల్‌నినో ప్రభావం క్రమంలో పంట దిగుబడి తగ్గడంతో బియ్యం ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయి. తెలంగాణలోనూ బియ్యం ధరలు పెరగ్గా.. కొంతమంది వ్యాపారులు దీనిని అసరాగా తీసుకుని ధరలు పెంచేస్తున్నారు. కిలో రూ.100, ఆపై ధరలకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. దీంతో బియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప

కూటమిలో అవమానాలు.. అయినా సర్దుకుపోతున్నాం: పురందేశ్వరి



అమరావతి,స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, బీజేపీ భారంగా మారిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై జాతీయ ఉపాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి ఘాటుగా స్పందించారు. కూటమిలో ఉంటూ బీజేపీకి తగిన బలం లేదని, సమన్వయ లోపం వల్లే నష్టం జరిగిందంటూ సోషల్ మీడియా వేదికగా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, విమర్శలను ఆమె గణాంకాలతో తిప్పికొట్టారు. ఎన్నికల్లో సాధించిన విజయాలన్నీ భాగస్వామ్య పక్షాల ఖాతాలోకి వేస్తూ, ఎదురైన కొన్ని వైఫల్యాలకు కేవలం బీజేపీనే బాధ్యురాలిని చేయడం సరికాదని స్పష్టం చేశారు. గెలుపు కూటమి సమష్టి విజయమైనప్పుడు.. ఓటమికి కూడా కూటమిలోని అన్ని పార్టీలు సమష్టిగానే బాధ్యత వహించాలని స్పష్టం చేస్తూ, మిత్రపక్షాల తీరుపై పరోక్షంగా అసహనం వ్యక్తం చేశారు.ఎన్నికల క్షేత్రంలో బీజేపీ ఎదుర్కొన్న వాస్తవ పరిస్థితులను పురంధేశ్వరి కుండబద్దలు కొట్టారు. కూటమి భాగస్వామ్య పార్టీల నుంచి తమకు ఎలాంటి సహకారం అందిందో అట్టడుగు స్థాయి కార్యకర్తలకు పూర్తిగా తెలుసని పేర్కొన్నారు. కొన్నిచోట్ల తీవ్ర అవమానకరమైన, కించపరిచే పరిస్థితులు ఎదురైనప్పటికీ.. వాటన్నింటినీ పంటిబిగువున భరించి బీజేపీ కార్యకర్తలు, అభ్యర్థులు అద్భుత విజయాలను నమోదు చేశారని గుర్తుచేశారు. సమన్వయంలో తలెత్తిన సమస్యలు, భాగస్వామ్య పక్షాల వైఖరి వల్ల ఎదురైన ఇబ్బందులను దాచిపెట్టేది లేదని, వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆమె తేల్చిచెప్పారు.మీడియా, సోషల్ మీడియాలో బీజేపీ ఓటములపైనే ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి చేస్తున్న దుష్ప్రచారాన్ని లెక్కలతో సహా ఆమె ఎండగట్టారు. బీజేపీ పోటీ చేసిన స్థానాల్లో ఏకంగా 59 శాతానికి పైగా విజయాలు సాధించిందని, ఇది పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న తిరుగులేని బలానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఉదాహరణకు రాజమండ్రి జిల్లా పరిధిలోనే కొవ్వూరు, గోపాలపురం , నిడదవోలు రాజమండ్రి రూరల్ స్థానాలను నూటికి నూరు శాతం గెలుచుకున్నా మని, అనపర్తిలో 11 స్థానాలకు గాను 10 స్థానాల్లో అఖండ విజయం సాధించామని వివరించారు.పార్టీని బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యకర్తలు తమ చెమటోడ్చి బలోపేతం చేశారని పురంధేశ్వరి స్పష్టం చేశారు. గెలిచిన ప్రజాప్రతినిధులు కార్యకర్తలను చిన్నచూపు చూడకుండా, పోలీస్ స్టేషన్ , తహసీల్దార్ కార్యాలయ పనుల్లో వారికి అండగా ఉంటూ గౌరవించాలని సూచించారు. పదవులు రాగానే అహంకారం ప్రదర్శించకుండా కార్యకర్తలను సమానంగా చూడాలని, రాబోయే 10-15 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఏపీ జనం తీర్పు... గుప్పిట పట్టి ఉండిపోయిందా ?



పోరాటం చేయని చోట కానీ లేదా వారు ఉదాశీనంగా ఉన్న చోట కానీ ఫలితాలు అధికారం వైపే ఉంటాయని అంటారు. ఇలా ఏ విధంగా చూసుకున్నా అధికార పక్షం గెలుపు అన్నది సర్వ సాధారణమే కానీ అరుదైనది కాదనే అంతా అంటారు.

జనం చెప్పేది ఎప్పుడు :

నిజానికి రాజకీయ నాయకులు తెలివైన వారు అనుకుంటారు. కానీ ఎంతో బలవంతులైన వారిని ఓడించిన ప్రజలే అసలైన తెలివైన వారు అని అంటారు. ప్రజలు కూడా ఎపుడు ఎక్కడ ఎలా తమ ఓటు ద్వారా విలక్షణ తీర్పు ఇవ్వాలో బాగా తెలిసిన వారు అని అంటారు. ఇక లోకల్ ఎలక్షన్స్ కి రాష్ట్ర ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు మధ్య తేడా కూడా కచ్చితంగా జనాలకు తెలుసు అని అంటారు. అందుకే స్థానిక ఎన్నికల్లో ఫలితాలు జనం అంతరంగాన్ని పెద్దగా బయటపెట్టలేదని కూడా విశ్లేషిస్తున్నారు. మరి వారు ఎపుడు తమ అసలైన తీర్పు ఇస్తారు అంటే అది 2029 సాధారణ ఎన్నికల్లోనే అని అంటున్నారు. అంతే ఆ ఎన్నికల్లోనే జనాలు తాము ఏమనుకుంటున్నది చెబుతారు అన్న మాట. అంతవరకూ జనం గుప్పిట మూసే ఉంచారు అని అంటున్నారు. సో ఈ తీర్పు అయితే కొలమానం అవుతానా కాదా అంటే విజయం ఎపుడూ ఉత్తేజమే కాబట్టి కూటమికి అది సానుకూలంగా ఉపయోగపడవచ్చు ఇక వైసీపీకి ఆత్మ విమర్శకు పనికి రావచ్చు అని అంటున్నారు.

అమరావతి,ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసాయి. మొత్తంగా చూస్తే పట్టణాలలో 98 లక్షల ఓటర్లు ఉంటే 62 లక్షల మంది ఓటు వేశారు. పరిషత్తు ఎన్నికల్లో రెండున్నర కోట్ల మంది ఓటర్లు ఉంటే కోటిన్నర మందికి పైగా ఓటు వేశారు. ఇది ఒక అంచనా. మొత్తంగా చూస్తే మూడున్నర కోట్ల మంది ఎన్నికల్లో పాలు పంచుకున్నారు అని ఒక లెక్క ఉంది. ఇదిలా ఉంటే మూడు కోట్ల మందికి పైగా ఓటర్లు ఇచ్చిన తీర్పు మీద ఏపీలో రకరకాలైన చర్చ సాగుతోంది. విశ్లేషణలు కూడా రాజకీయంగా ఎవరికి తోచిన తీరున వారు చేస్తున్నారు.

అంత వ్యత్యాసం ఉంటుందా :

ఇక టీడీపీ అధినేత కూటమి పెద్దన్న అయిన చంద్రబాబు అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి వైసీపీకి మధ్య ఓటు షేర్ చూస్తే ఏకంగా పాతిక శాతం దాకా ఉందని చెప్పారు. అవన్నీ అంకెలతో సహా ఆయన వివరించారు. ఆయన చెప్పిన దాని ప్రకారం చూస్తే లెక్క కరెక్ట్ గానే ఉంది. అయితే అదే రోజున వైసీపీ మాజీ మంత్రి సీనియర్ నేత పేర్ని నాని అయితే మీడియా సమావేశం పెట్టి మరీ కూటమి మీద విమర్శలు చేశారు. వైసీపీకి ఎక్కడ పోటీ చేయించారు అని ఆయన మండిపడ్డారు. అనేక చోట్ల వైసీపీ పోటీలోనే లేకుండా చేశారు అన్నారు. అలాగే పులివెందుల లాంటి చోట్ల దొంగ ఓట్లు వారే వేసుకుని గెలిచారు అని కూటమి మీద విరుచుకుపడ్డారు.

తీర్పు తిరుగులేనిదేనా :

ఇవన్నీ పక్కన పెడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన తీర్పు తిరుగులేనిది గానే చూడాలా అన్నది అసలు ప్రశ్న. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు దేశంలో ఎక్కడ జరిగినా అధికార పార్టీకే పట్టం కడతాయి. అది ఆనవాయితీ. అంతే కాదు ప్రజలు ఎక్కడ ఉన్నా అభివృద్ధి కోరుకుంటారు. అలా అధికారంలో ఉన్న పార్టీతో తామూ నడవాలని చూస్తారు. ఇంకా సగం పాలన ఉంది కాబట్టి అభివృద్ధి ఫలాలు తమ ప్రాంతానికి రావాలని అనుకుంటారు. అంత తేలికగా వారు బయట పడరు అని కూడా అంటూంటారు. అందుకే ప్రజలు వేసే ఓటు అధికార పార్టీకే కచ్చితంగా ఉంటుందని అంటారు. ఇక ఎటూ అధికార పార్టీకే అండదండలు ఉంటాయి, మండీ మార్బలం ఉంటుంది కాబట్టి మరింత అడ్వాంటేజ్ వారికి ఉంటుంది అని అంటారు. ఆ మీదట విపక్షం గట్టిగా

సైబరాబాద్‌లో కొత్త కేంద్రం ప్రారంభం.. ఒకే చోట అన్ని సేవలు!



సైబరాబాద్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని డీజీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా ఐటీ కంపెనీలు, ఆసుపత్రులు ఉన్న ప్రాంతాల్లో రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు కష్టంగా మారుతున్నాయని చెప్పారు.ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాలు కనుగొనేందుకు నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు 'సైబరాబాద్ మూవ్స్'పేరుతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశాల్లో ఐటీ కంపెనీలు,ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థలు,బస్ రవాణా నిర్వాహకులు,ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు పాల్గొననున్నారు. కార్‌పూలింగ్, ప్రజా రవాణా వినియోగం,ఉద్యోగుల ప్రయాణ సమయాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించ నున్నారు.ట్రాఫిక్ నియంత్రణకు వినూత్న ప్రయోగాలు చేసేందుకు పోలీ సు శాఖ సిద్ధంగా ఉందని,ఐటీ రంగం నుంచి వచ్చే ఆచరణాత్మక సూచనల కు పూర్తి సహకారం అందిస్తామని డీజీపీ తెలిపారు.కొత్త విధానాలను అమలు చే సే తొలినాళ్లలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా,దీర్ఘకాలంలో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ట్రాఫిక్ సమస్యపై ప్రజల్లో అవగాహన సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

షీ టీమ్స్ నుంచి టీ సేఫ్ వరకు.. ఎన్నో సేవలు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ సీపీగా పనిచేసిన సీవీ ఆనంద్ వేసిన పునాదులు ప్రస్తుతం సమర్థవంతమైన వ్యవస్థలుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం ప్రారంభించిన షీ టీమ్స్,షీ షటిల్స్, సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన ఉమెన్ పెట్రోల్ వాహనాలు, టీ సేఫ్ యాప్ మహిళలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు.

హైదరాబాద్, మహిళలు, బాలికల భద్రతకు మరింత అండగా నిలిచేందుకు సైబరాబాద్‌లో మరో కీలక అడుగు పడింది. మహిళలపై లైంగిక దాడులు, ఇతర నేరాలకు గురైన బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని ఒకే చోట అందించేలా సూతనంగా నిర్మించిన భరోసా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. డీజీపీ సీవీ ఆనంద్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు వైద్య పరీక్షలు, మానసిక కౌన్సెలింగ్, న్యాయపరమైన సహాయం వంటి సేవలను ఒకే వేదికపై అందించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.

ఏడేళ్ల నిరీక్షణకు తెర.. ఒకే చోట అన్ని సేవలు

సైబరాబాద్‌లో భరోసా కేంద్రం నిర్మాణం పూర్తవడానికి ఏడేళ్ల సమయం పట్టిందని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఇన్నాళ్ల నిరీక్షణ తర్వాత కేంద్రం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. బాధిత మహిళలు, బాలికలు ఒక్కో అవసరానికి ఒక్కో కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా వైద్య పరీక్షలు, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, ఇతర అవసరమైన సేవలను ఒకే చోట అందించడమే భరోసా కేంద్రాల ప్రత్యేకతగా వివరించారు.దేశంలోనే ప్రత్యేకమైన విధానంలో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయని చెప్పారు. బాధితులకు పోలీసు సహాయం అందించడంతో పాటు వారు ఎదుర్కొన్న మానసిక వేదన నుంచి బయటపడేందుకు నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం కేసుల దర్యాప్తు, న్యాయ ప్రక్రియలోనూ ఉపయోగపడుతోందన్నారు. హైదరాబాద్‌లో ప్రత్యేక పోక్సో కోర్టు ఏర్పాటు కూడా నేరస్తులకు శిక్షలు పడే అవకాశాలను మెరుగుపరిచేందుకు దోహదపడుతోందని పేర్కొన్నారు.

మహిళల భద్రతలో ఐటీ సంస్థల భాగస్వామ్యం కీలకం

మహిళల భద్రత కోసం సెక్యూరిటీ కౌన్సిల్ ఫర్ సైబరాబాద్ (ఎస్‌సీఎస్‌సీ) అందిస్తున్న సహకారాన్ని డీజీపీ అభినందించారు. భరోసా కేంద్రం నిర్మాణానికి రహేజా డైరెక్టర్ శ్రావణ్ ఆర్థిక సహాయం అందించడం ప్రశంసనీయమన్నారు. గతంలోనూ మహిళల భద్రతకు సంబంధించిన పలు కార్యక్రమాలకు సంస్థ మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు.ఈ సందర్భంగా 2013 మేలో చోటుచేసుకున్న రెండు అత్యాచార ఘటనలను ప్రస్తావించారు. అప్పట్లో చిన్న ఆధారంతోనే దర్యాప్తులో కీలక పురోగతి సాధించిన విషయాన్ని గుర్తుచేస్తూ, వాటిలో ఒకటి అభయ కేసుగా గుర్తింపు పొందిందని తెలిపారు. మహిళల భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ఐటీ సంస్థలు కూడా సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ సమస్యకు 'సైబరాబాద్ మూవ్స్' పరిష్కారం?

జగన్ గ్రౌండ్ లోకి దిగాల్సిందే...లేకపోతే కష్టమేనట !



అమరావతి,వైసీపీ అధినేత జగన్ 2024 ఓటమి తరువాత ఎక్కువగా తాడేపల్లి టూ బెంగళూరు గానే షటిల్ సర్వీస్ చేస్తున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ఆయన పార్టీ వారితో అపుడపుడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అది కూడా నియోజకవర్గాల ఇంచార్జిలు, రీజనల్ కోఆర్డినేటర్లు, పార్టీ సీనియర్ నేతలు ఇలా పై స్థాయిలో మాత్రమే. వారితో మాట్లాడుతూ పార్టీని వారి ద్వారానే నడిపిస్తున్నారు. ఇక అక్కడ వచ్చే ఇన్ పుట్స్ అన్నవి అధినాయకత్వానికి అందుతున్నాయి. కానీ అవే నిజం అనుకుంటే గ్రౌండ్ లెవెల్ లో ఏమి జరుగుతుందో ఫీడ్ బ్యాక్ ఎలా తెలుస్తుంది అన్నది చర్చగా ఉంది. అయితే వైసీపీ అధినాయకత్వం అక్కడితో ఆగకుండా తమ సొంత సర్వేలు చేయిస్తోంది. అలా ఏపీలో ఓటమి మీద చేయించిన సర్వేలలో చాలా విషయాలు తెలిసాయని అంటున్నారు.

ఎంతవరకూ చూడాలి :

ఇక ఈ సర్వే నివేదికలు అన్నవి కూడా కొంత పరిమితితో కూడి ఉంటాయని అంటున్నారు. నిజానికి వైసీపీకి సర్వేలు పెద్దగా అచ్చి రాలేదని అంటారు. 2019 ఎన్నికల వేళ తప్పించి 2024 సర్వేలు పూర్తిగా బోల్తా కొట్టించాయి. అంతకు ముందు పలు సందర్భాల్లో చేయించిన సర్వేలు కూడా పూర్తి వాస్తవాలను అధినాయకత్వం ముందు ఉంచలేకపోయాయని గుర్తు చేస్తున్నారు. మరి ఈ సర్వేలు అయితే ఒక మాదిరి పిక్చర్ ని మాత్రమే ఇస్తాయని తెలుస్తోంది. దాంతో పూర్తి విషయలు తెలియాలి అంటే ఏమి చేయాలి అన్నది ప్రశ్న ఉంది. దానికి జవాబు కూడా ఉంది. అదే జగన్ గ్రౌండ్ లెవెల్ లోకి డైరెక్ట్ గా దిగాల్సిందే అని అంటున్నారు.

సమీక్షలు అక్కడే :

వైసీపీ అధినాయకత్వం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల మధింపుని చేస్తోంది అని అంటున్నారు. అయితే అవి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కాకుండా జిల్లాలకు వెళ్ళి క్షేత్ర స్థాయిలో ద్వితీయ తృతీయ శ్రేణి నాయకులతో పాటు క్యాడర్ తో కలిసి కూర్చుని చర్చిస్తేనే పూర్తి సమాచారం పక్కాగా వస్తుంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ఎప్పటికీ వైసీపీకి ఈ ఇబ్బందులు తప్పవని కూడా అంటున్నారు. ఏపీలో వైసీపీకి గత అనుభవాలు ఉన్నాయి, ఓటములు ఉన్నాయి. కానీ 2024 తరువాత పరిస్థితులు వేరు అని అంటున్నారు.

బలంగా కూటమి :

రాజకీయాల్లో కూటములు బలంగా ఉన్నపుడు సహజంగానే మొగ్గు ఆ వైపు ఉంటుంది. ఏపీలో కొన్ని రీజియన్లలో అదే జరుగుతోంది అని అంటున్నారు. ఇక కొన్ని చోట్ల తీసుకుంటే వైసీపీకి బలం ఉండి కూడా ఎత్తిగిల్లలేకపోతోంది. మరి కొన్ని చోట్ల అన్నీ ఉండి వర్గ పోరుతో సతమతం అవుతోంది. ఇలా వివిధ కారణాలు ఉన్నాయి. ఇక ఇన్ చార్జిలలో అనేక మంది గడచిన రెండున్నరేళ్లుగా గ్రౌండ్ లెవెల్ లో పనిచేయడం లేదని చెబుతున్నారు. అలాగే క్యాడర్ కి లీడర్లకు మధ్య గ్యాప్ అలాగే ఉందని అంటున్నారు. అది స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగడం వల్లనే చేదు ఫలితాలు వచాయని చెబుతున్నారు.

సంస్థాగతంగా :

అదే విధంగా చూస్తే సంస్థాగతంగా వైసీపీ నిర్మాణంలో కూడా మరమ్మతులు చేయాల్సి ఉందని అంటున్నారు. ప్రస్తుతం అనేక చోట్ల ఇన్ చార్జిలను అధినాయకత్వం ప్రకటించింది. వారిని పై నుంచి దిగుమతి చేసింది. దాంతో క్యాడర్ మెచ్చిన నాయకులు కొన్ని చోట్ల ఉంటే మరి కొన్ని చోట్ల లేరని అంటున్నారు. అలా కాకుండా క్యాడర్ తో చర్చించి అందరికీ అందుబాటులో ఉండే వారిని ఇకనైనా ఏర్పాటు చేసుకుంటే 2029 ఎన్నికల నాటికి వైసీపీ బలపడుతుందని అంటున్నారు. పార్టీ కోసం గట్టిగా పనిచేసేవారికి ఛాన్స్ ఇవ్వాలని అలాగే 2029 ఎన్నికల్లో వారికే చాన్స్ ఇస్తామని భరోసా కల్పించాలని అపుడే వారు

టీడీపీ,వైసీపీ సైలెంట్.. కానీ జనసైనికులదే రచ్చ!



మీడియాలో టీడీపీ నాయకత్వంపై, చంద్రబాబుపై అత్యంత విషపూరిత ప్రచారం సాగిస్తున్నారు. పవన్ వ్యక్తిగత అంశాన్ని నెపంగా చూపి ఇరు పార్టీల కేడర్ మధ్య చిచ్చు పెట్టేందుకు ఇలాంటి ముసుగు ఖాతాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఈ కుట్రను గ్రహించలేని అమాయక జనసేన అభిమానులు కూడా ఆ ఉచ్చులో పడి కూటమి సమన్వయాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తుండటం పార్టీ సీనియర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

ఇలాంటి అనుకూల శత్రువుల్ని కంట్రోల్ చేసుకోవాల్సిందే!

జనసేన అధిష్ఠానం, పార్టీ అధికారిక డిజిటల్ వింగ్ తక్షణమే కళ్లు తెరిచి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. అసలైన కార్యకర్తలు ఎవరు, విధ్వంసకర ఫ్యాన్స్ ఎవరు, ప్రత్యర్థి పార్టీల నుంచి చొరబడిన కోవర్టులు ఎవరన్నది వడపోసి కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారిక వేదికల ద్వారా మిత్రపక్షాలపై తప్పుడు ఆరోపణలు చేసే ఖాతాలను బహిరంగంగా తిరస్కరించాలి. రాజకీయ పరిణతి లేకుండా సోషల్ మీడియాలో రెచ్చిపోతే అంతిమంగా నష్టపోయేది పవన్ కల్యాణ్ ఇమేజ్, కూటమి స్థిరత్వమేనన్న నిజాన్ని అభిమానులకు బోధించాల్సిన బాధ్యత జనసేన అగ్ర నాయకత్వంపై ఉంది. ఈ అనియంత్రిత శక్తులను ఇప్పటికైనా కట్టడి చేయకపోతే.. బయటి శత్రువుల కంటే అనుకూల శత్రువుల వల్లే జనసేనకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైవాహిక జీవిత పరిణామాలపై అటు అధికార భాగస్వామి తెలుగుదేశం పార్టీ, ఇటు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తమ శ్రేణులకు కఠిన సంయమన మార్గదర్శకాలను జారీ చేశాయి. నాయకుల వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాల్లోకి లాగవద్దని, ఎలాంటి అనుచిత పోస్టులు పెట్టవద్దని ఆ రెండు పార్టీలు హెచ్చరించాయి. అయితే, క్షేత్రస్థాయిలో ప్రధాన పార్టీలు హుందాతనం ప్రదర్శిస్తుంటే.. జనసేన ముసుగులో ఉన్న కొందరు సోషల్ మీడియా ఔత్సాహికులు, అభిమానులు మాత్రం పరిస్థితిని అనవసరంగా రగిలిస్తూ వివాదాలను పెంచి పోషిస్తున్నారు.

ఆ నోట్ అందరికీ పంపింది పవన్ పీఆర్వోనే!

జనసేన పార్టీ సోషల్ మీడియా బలానికి, బలహీనతకు ప్రధాన కారణం అందులో అత్యధికులు సాధారణ సినీ అభిమానులే కావడం. వీరిలో చాలామందికి పార్టీ సంస్థాగత నియమావళి, రాజకీయ లక్ష్మణరేఖలపై ఎలాంటి స్పష్టమైన అవగాహన ఉండదు. అధికారిక పార్టీ గొడుగు కింద క్రమశిక్షణతో కాకుండా, వ్యక్తిగత ఖాతాల ద్వారా తాము పవన్ కల్యాణ్‌ను కాపాడుతున్నాం అనే భ్రమలో చేసే పోస్టులు చివరకు పార్టీకే తీవ్ర కీడు చేస్తున్నాయి. స్వయంగా పవన్ కల్యాణ్ పీఆర్వో అధికారికంగా విడాకుల ప్రెస్ నోట్‌ను విడుదల చేసినప్పటికీ.. ఆ విషయాన్ని సైతం టీడీపీ వర్గాలే మీడియాకు లీక్ చేశాయంటూ మిత్రపక్షంపై బురదజల్లే పోస్టులు పెట్టడం వీరి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. మిత్రధర్మాన్ని విస్మరించి టీడీపీ శ్రేణులను బహిరంగంగా కించపరచడం, ప్రతి చిన్న అంశానికీ ప్రత్యర్థులతో పాటు మిత్రులనూ రెచ్చగొట్టడం వీరి ప్రధాన ధోరణిగా మారింది.

పవన్ కు సపోర్టు పేరుతో ఇతరులపై అనుచిత పోస్టులు

ఈ గందరగోళంలో మరో ప్రమాదకరమైన కోణం కూడా దాగి ఉంది. జనసేన అభిమానుల రూపంలో చెలరేగిపోతున్న కొందరు ఖాతాదారులు వాస్తవానికి వైసీపీకి చెందిన కోవర్ట్స్ అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. టీడీపీ-జనసేన కూటమిని మానసికంగా, రాజకీయంగా చీల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న కొందరు కేటుగాళ్లు.. తాము పవన్ భక్తులమని చెప్పుకుంటూ సోషల్

డబ్బుల్లేవ్.. బీఆర్ఎస్‌కు ఇన్చార్జుల షాక్.. !



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రత్యర్థులపై పైచేయి సాధించాలని పావులు కదుపుతున్నాయి. అయితే, అందరికంటే ముందుగానే అలర్ట్ అయ్యి, ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్‌వర్క్ ప్రారంభించిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. పార్టీ అధినాయకత్వం ఎంత గట్టిగా ప్లాన్ చేసినా, క్షేత్రస్థాయిలో ఇన్చార్జుల నుంచి వస్తున్న స్పందన మాత్రం గులాబీ బాస్‌లకు షాకిస్తోంది.ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలోని దాదాపు 40 నుంచి 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ఊపందుకునేలా ప్రతి నియోజకవర్గంలోనూ ఒక భారీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలని, తాను స్వయంగా వాటికి హాజరవుతానని కూడా ఆయన స్పష్టం చేశారు. కానీ, ఆచరణలోకి వచ్చేసరికి ఆ ప్లాన్‌కు అనూహ్యంగా బ్రేక్ పడింది. అభ్యర్థి ఎవరో ఖరారు కాకుండా నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు పెట్టడం కష్టమని, పైగా ఈ భారాంతా తమ భుజాల మీదే వేసుకోవడం ఇబ్బందికరమని ఇన్చార్జులు భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

పైసలేమన్నా చెట్లకు కాస్తున్నాయా..?

నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు అంటే మాటలు కాదని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. భారీ హాల్స్ బుకింగ్స్, కార్యకర్తలకు భోజనాలు, ఇతర ఏర్పాట్ల కోసం తడిసిమోపెడవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కేవలం రెండు మూడు నెలల క్రితమే ఎస్ఐఆర్ సన్నాహక సమావేశాల పేరుతో తాము భారీగా ఖర్చు పెట్టామని, అప్పట్లో కేటీఆర్, హరీష్ రావుల పర్యటనల కోసం జేబులు గుల్ల చేసుకున్నామని నేతలు వాపోతున్నారట. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికలంటూ భారీ సభలు పెట్టి లక్షల రూపాయలు ఖర్చు పెట్టే ఆర్థిక పరిస్థితి లేదని, "డబ్బులేమన్నా ఊరికే వస్తున్నాయా?" అంటూ ఇన్చార్జులు అంతర్గతంగా పెదవి విరుస్తున్నట్లు సమాచారం.ఖర్చుల భయంతో పాటు రాబోయే రోజుల్లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా నేతలను వెనకడుగు వేసేలా చేస్తోంది. భవిష్యత్తులో తమ పరిధిలో ఏయే మండలాలు ఉంటాయో, ఏవి మారుతాయో ఇప్పుడే స్పష్టత లేని పరిస్థితుల్లో.. కేవలం ఓటర్ల నమోదు కోసం ఇప్పుడు భారీగా ఖర్చు పెట్టడం దండుగ మారి పనేనని నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉందన్న ఆలోచనతో, ఇప్పటికప్పుడు భారీగా నిధులు ఖర్చు చేయడం అనవసరమని అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు గులాబీ శిబిరంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక ఇన్చార్జుల నుంచి స్పందన మందగించడాన్ని గమనించిన అధిష్టానం కూడా పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు తెలుస్తోంది. భారీ సభలు, ఆర్భాటాలకంటే కేవలం ఓటర్ల నమోదు ప్రక్రియే ముఖ్యమని భావించి పెద్ద ఎత్తున సమావేశాలు పెట్టాలనే ఆలోచనను పక్కనపెట్టింది. నియోజకవర్గాల వారీగా కాకుండా, మండల స్థాయిలోనే సింపుల్‌గా సమావేశాలు నిర్వహించు కోవాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు, ముందుగా అభ్యర్థిని ప్రకటించి, ఆ తర్వాత మీటింగ్‌లు పెడితేనే క్యాడర్‌లో జోష్ వస్తుందని, లేదంటే అనవసర ప్రయాస అవుతుందనే వాదనకు పార్టీ పెద్దలు కూడా సుముఖత చూపినట్లు తెలుస్తోంది. మొత్తానికి, డబ్బుల్లేవ్ అంటూ ఇన్చార్జులు చూపిన నిరాసక్తత ఇప్పుడు బీఆర్ఎస్ వ్యూహాత్మక సర్దుబాట్లకు కారణమవుతోంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140